గ్రామాల్లో రక్షణ దళాలు

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- రాత్రి సమయంలో గ్రూపులుగా తిరుగుతూ గస్తీ
- నేరాల అదుపునకు దోహదం
- ఆత్మకూర్(ఎం) మండలంలో 400మంది వలంటీర్లు

ఆత్మకూరు(ఎం) : జిల్లాలో చైన్ స్నాచింగ్‌లు, తాళం వేసి ఉన్న ఇళ్లల్లో, వ్యవసాయ బావుల వద్ద చోరీలు తదితర సంఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు ఆత్మకూరు(ఎం) పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. డీసీపీ ఆదేశాల మేరకు గ్రామాల్లో యువకులతో రక్షణ వలంటీర్ల వ్యవస్థను నియామకం చేసింది. దీంతో వలంటీర్లు గ్రామాల్లో రాత్రి పూట 11గంటల నుంచి 2గంటల వరకు గస్తీ తిరుగుతున్నారు. గస్తీ దళాలు గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు రాత్రి సమయంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తారు. అంతే కాకుండా వారి నుంచి వివరాలను తీసుకుంటారు.



తిమ్మాపురంలో అవగాహన కల్పిస్తున్న యువకులు

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు..

గ్రామాల్లో దొంగతనాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వలంటీర్లు అవగాహన కల్పిస్తున్నారు. బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట పడుకోకూడదని, కొత్త వ్యక్తులు మాట్లాడటానికి ప్రయత్నిస్తే వారితో జాగ్రత్తగా ఉండాలని, బంగారు ఆభరణాలు ధరించిన మహిళలు మెడ చుట్టు కొంగు చుట్టుకోవాలని వలంటీర్లు మైక్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

400మంది యువకులతో రక్షణ దళాలు ఏర్పాటు..

గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



కొరటికల్‌లో గస్తీ తిరుగుతున్న గ్రామ వలంటీర్లు

రక్షణ వలంటీర్ వ్యవస్థలో మండలంలో 400మంది యువకులు ముందుకు వచ్చారు. గ్రామానికి 10నుంచి 20మంది వరకు నియమించి వారితో ఎస్‌ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే ఈ వాట్సాప్ గ్రూప్ ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందుతుంది. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకునే విధంగా వలంటీర్లు సమాచారం అందజేశారు. దీంతో మండలంలో నేరాలను, దొంగతనాలను అదుపు చేయవచ్చని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

సేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది



మాగ్రామంలో వలంటీర్‌గా నియామకం అయ్యాను. గ్రామంలో నాతో పాటు 20 మంది యువకులం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వలంటీర్లుగా పని చేస్తున్నాం. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు జరుగుకుండా రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తూ గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామానికి సేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– గాడిపెల్లి ఉదయ్‌కుమార్, వలంటీర్, కొరటికల్

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నేరాలు అదుపు చేయడం కోసం ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. మండలంలో 400మంది యువకులు రక్షణ వలంటీర్లుగా ఉండటానికి ముందుకు వచ్చారు. వలంటీర్ల ద్వారా గ్రామాలకు రాత్రి సమయంలో రక్షణ కల్పిస్తున్నాం. పోలీసులు ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

– దొమ్మేటి నాగరాజు, ఎస్‌ఐ ఆత్మకూరు(ఎం)

కేసీఆర్ అహంకారంతో వ్యవహరిస్తున్నారు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు బుద్ధిచెప్పినా ఆయన తీరు మార్చుకోలేదని.. ఇంకా దురహంకారంతో వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను విస్మరించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తే.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తూ మళ్లీ రైతుల పొలాల్లోకి ఏముఖం పెట్టుకొని వెళ్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరం వర్షాలు తక్కువ పడటంతో భూగర్భజలాలు తగ్గాయని, కాంగ్రెస్ ప్రభుత్వంతో కరువు రాలేదన్నారు. వర్షాలు లేక, ప్రాజెక్టులన్నీ ఎండిపోయాయన్నారు. రైతుల పొలాలు ఎండిపోవడం బాధాకరమేనని, రైతుల గురించి తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని వెల్లడించారు. గత ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఫామ్ హౌజ్‌కు పరిమితం చేస్తే.. మళ్లీ ఎన్నికలు వచ్చాయని పల్లెబాట పట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చిల్లర, మల్లర మాటలు బంద్ చేసి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్రను సక్రమంగా వహించాలన్నారు. ఆయన వెంట యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఇఫ్తార్ విందులో పాల్గొన్న విప్ ఐలయ్య

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని యాదగిరిపల్లి మజీదులో ఆదివారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముస్లింలతో కలిసి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

వలిగొండ : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని అరూరులో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధర్మేంద్ర, ఎల్లంకి మహేష్, బబ్బూరి శ్రీధర్, సాయికుమార్, మేడి దేవేందర్, యాదయ్య, నరసింహారెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గోద శ్రీరాములు

క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

భువనగిరి : పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ భువనగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జనగాం పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుటుంబానికి పరామర్శ

భువనగిరి రూరల్ : మండలంలోని నందనం గ్రామ మాజీ సర్పంచ్ కడమంచి ప్రభాకర్ తల్లి కడమంచి జాలమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు చీరిక సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగు వినోద్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ నాగెల్లి రమేష్‌గౌడ్, నాయకులు అంజనేయులుగౌడ్, వెంకటేష్, స్వామి, నర్సింహ తదితరులు ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్

తుర్కపల్లి : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎంపీపీ భూక్య సుశీలరవీందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మజ్జిద్‌లో ముస్లింలకు ఎంపీపీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు

మోత్కూరు : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. విజయం కోసం తామంతా సైనికులా పనిచేస్తామన్నారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, రెడ్డి సంఘం పట్టణ అధ్యక్షుడు లింగాల జైపాల్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు సూదగాని యాదగిరిగౌడ్, నాయకులు పైళ్ల నర్సిరెడ్డి, చల్లా వెంకట్‌రెడ్డి, మూల నర్సింహ, సంతోష్ ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

భువనగిరిటౌన్ : పట్టణంలోని పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎండీ ఇస్తియాక్ అహ్మద్, కార్యదర్శి షానూర్, కోశాధికారి రషీద్, సహాయ కార్యదర్శి జిలాని, మసీద్ కమిటీ సభ్యులు అసద్ సహాబ్ గౌరీ, గయాజ్, సిరాజ్, ఆదిల్‌షకీల్, రెయ్యాన్, మొక్తర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య నివారణకు చర్యలు

ఆత్మకూరు(ఎం) : గ్రామాల్లో నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి షఫీయోద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్రాయపల్లిలో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నీటి సమస్య ఉన్నట్లు ఆయనకు వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షహేష్, కారోబార్ నర్సింహ, గ్రామస్తులు ఉన్నారు.

ఆస్తి పన్ను వసూలు రూ.104.88లక్షలు

భూదాన్‌పోచంపల్లి : ఆస్తి పన్ను వసూల్‌కు ఆదివారం చివరిరోజు కావడంతో మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులను వసూల్ చేశారు. ఆదివారం ఒక్క రోజే రూ.4.86లక్షల పన్నులు వసూలైనట్లు కమిషనర్ వెల్లడించారు. రూ.104.88లక్షలు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు.

ఎంపీగా మల్లేశంను గెలిపించాలి

తుర్కపల్లి : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశంను అఖండ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, గట్టు నిఖిల్, సుదగాని హరిశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

సమాజంలో వస్తున్న విషప్రచారాన్ని అడ్డుకోవాలి

భువనగిరిటౌన్ : సమాజంలో వస్తున్న వినిమయ, విషప్రచారాన్ని అడ్డుకోవాలని, అందుకు నేటి సమాజానికి అవసరమయ్యే కళలను సంస్కృతిని అందించాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్ట నర్సింహ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో చరిత్రను వక్రీకరించే విధంగా సినిమాలు వస్తున్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ ఎర్రజెండా విప్లవ పోరాటం లేకుండా తెలంగాణ ప్రజలు విముక్తి కాలేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో మత, కుల, ప్రాంతీయ, మూఢవిశ్వాసాలను పెంచుతూ ప్రజల్లో విద్వేషాలను సృష్టిస్తున్నారని, తద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ఆలోచిస్తున్నారని, అలాంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. భారతీయులందరూ ఒకటేనని చాటి చెప్పే కళారూపాలను పాటలను, నత్యాలను తయారు చేయాలన్నారు. వాటిని సోషల్ మీడియాలో అధునాతన పద్ధతిలో ప్రజలకు అందే విధంగా కృషి చేయాలన్నారు. నేటి యువత మత్తుపదార్థాల వైపు పయనించే విధంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. యువత ఆబాట పట్టకుండా చూడాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవార్ గోవర్ధన్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి ముత్యాలు, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కట్ట నర్సింహ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భూదాన్‌పోచంపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 పదోతరగతికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు సత్తయ్య, సత్తిరెడ్డి, చంద్రశేఖర్, జోస్‌మేరీ, జయలలిత, స్వర్ణలత, కిషోర్, నాగమణి, ఉమను పూర్వ విద్యార్థులు శాలువా కప్పి, మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బోయిని లింగస్వామి, మొగిలిపాక సంతోష్, రాజశేఖర్, బాల్‌రెడ్డి, బాలమణి, చెరుకు స్వప్న, అలివేలు, కవిత, అంజలి, సురేందర్‌రెడ్డి, చింతల రాజశేఖర్, జ్యోతి, రాజేశ్వరి, అమరావతి ఉన్నారు.

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2010–11లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డప్పరెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీధర్, సురేష్, వెంకటేష్, వేణుగోపాల్, గిరీష్, అరుణ, శ్వేత పాల్గొన్నారు.



ఆలేరురూరల్ : కొలనుపాకలో..

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



భువనగిరి : గాస్పల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



భువనగిరి రూరల్ : వీరవెల్లి చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్లు

భువనగిరి : పట్టణంలోని ఆయా చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక గాస్పల్ చర్చి, మన్నా, సీఎస్‌ఐ చర్చిలకు చెందిన పాదర్స్ ఏసుక్రీస్తు బోధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా చర్చీల పాదర్స్ జాన్సన్, సుదర్శన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వీరవెల్లి, జమ్మాపురం, కూనూరు, చీమలకొండూర్, నందనం తదితర గ్రామాల్లో చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ పాపయ్య, సిల్వరాజ్, జూలియస్, ఎం.అనీల్, మాజీ ఉపసర్పంచ్ మాదాసు కర్మెలమ్మ జార్జ్, పాస్టర్ ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తు మరలా జన్మించిన సందర్భాన్ని గుర్తు చేసుకుని రాత్రి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉదయం కేక్ కట్ చేసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి పాదర్ బాలస్వామి, జాన్‌పాల్, చిలుక సుధాకర్, రాజ్‌కుమార్, శోభ, రాజేష్ తదితరులు ఉన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యోదయానికి ముందే రైల్వేస్టేషన్ సమీపంలోని కొండపై ఏసును భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఈ సందర్భంగా పాస్టర్ రేపాల ప్రకాష్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని అన్నెపువాడలోని ఫుల్ గాస్పల్ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ వైఎస్.ఆషేర్ పాల్గొని కీర్తనలు ఆలపించారు.



మోటకొండూర్ : న్యూ జెరూసలెమ్ చర్చిలో..



రామన్నపేట : ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవులు



మోత్కూరు : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కుమ్మర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తుర్కపల్లి: కుమ్మర్ల ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి, నిధులు కేటాయించాలని కుమ్మర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ కోరారు. తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కుమ్మరి సంఘం మండల నూతన కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కుమ్మర్లకు ప్రతి మండలంలో 2 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జివిలికపల్లి శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా దేవరుప్పల బాలయ్య, మండల అధ్యక్షుడిగా దేవరుప్పల అయిలయ్య, ఉపాధ్యక్షుడిగా ఇంద్రపాల సత్యనారాయణ, అలదుర్గం కరుణాకర్, రేణుకుంట భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా నాగాయపల్లి శివరాములు, సహాయ కార్యదర్శిగా బేతాల భిక్షపతి, కోశాధికారిగా జాగిల్లపురం సత్తయ్య, ప్రచార కార్యదర్శిగా కొలనుపాక కొండల్, మీడియా కోర్డినేటర్‌గా జిల్లికపల్లి మహేశ్, యూత్ అధ్యక్షుడిగా తిగుల్ల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రాజు, నియోజకవర్గ కన్వీనర్‌గా జివిలికపల్లి ఆంజనేయులు, కో కన్వీనర్‌గా దేవరుప్పల మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పావణి, జిల్లా అధ్యక్షుడు తాడూరి ఆంజనేయులు, కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

విద్యుత్ లైన్‌మన్ బదిలీ

యాదగిరిగుట్ట : మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపల్లి విద్యుత్ లైన్‌మన్ గునగంటి బాబు మోత్కూర్ పట్టణంలోని సబ్‌స్టేషన్‌కు బదిలీఅయ్యినట్లు డీఈ మల్లికార్జున్ ఆదివారం వెల్లడించారు. బాబుపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మొదటగా భువనగిరి డివిజన్ కార్యాలయానికి అటాచ్ చేసి, అనంతరం మోత్కూర్‌కు బదిలీ చేశారు.

ఘనంగా అగ్నిగుండాలు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మోత్కూరు : మున్సిపాలిటీలోని శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అగ్నిగుండాలు నిర్వహించారు. అగ్ని గుండం చుట్టూ స్వామి వారితో కలిసి ప్రదక్షిణలు చేసి భక్తులు నిప్పులపై నడిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్, ఆలయ అర్చకులు రామలింగంశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు కోమటి మత్స్యగిరి, బుర్ర సంతు, కోమటి జనార్దన్, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, బుర్ర యాదయ్య, సూదగాని కిష్టయ్య, కారుపోతుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట : భువనగిరి మండలం రాయగిరిలో ఏర్పాటు చేసిన నృసింహ అభయారణ్యంలోని జింకలపై వీధి కుక్కలు దాడి చేసి చంపడం బాధాకరమని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు రక్షణ కల్పించకపోవడంతో జింకలపై కుక్కలు దాడి చేసి చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు బందారపు మల్లేష్‌గౌడ్, చిత్తర్ల కృష్ణగౌడ్, దొమ్మట ప్రభాకర్, కర్రె శ్యాం తదితరులున్నారు.

కేసీఆర్‌కు స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

భువనగిరి : జనగాం జిల్లాలో ఎండిన వరిపంటలను పరిశీలించేందుకు ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా భువనగిరిలో ఆపార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. బస్సు నుంచే నాయకులకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ర్యాకల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్, పట్టణ, మండల కమిటీల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. ఎర్రవల్లి ఫామ్ హౌజ్ నుంచి మాజీ సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 12గంటలకు స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తాకు రాగా తిరుగు ప్రయాణంలో భువనగిరి పట్టణం మీదుగా రాత్రి 8గంటల 30నిమిషాలకు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు.

ఆలేరురూరల్ : జనగాం జిల్లాలో ఎండిన వరిపొలాలు పరిశీలనకు వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు ఆదివారం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. వారిలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు హరిశంకర్, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, పుట్ట మల్లేషం పాల్గొన్నారు.

రామన్నపేట : పంట నష్టం పరిశీలనకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ తిరుగు ప్రయాణంలో రామన్నపేట మీదుగా ఆదివారం రాత్రి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులకు పట్టణంలో అభివాదం చేశారు.

తుర్కపల్లి : జనగాం జిల్లాలో ఎండి వరిపంటలను పరిశీలించేందుకు వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు ఆదివారం మండల కేంద్రంలో టీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీలు తోటకూర అనురాధ బీరయ్య, సుశీలరవీందర్‌నాయక్, చిమ్ముల సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తుర్కపల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న నాయకులు



కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీ తిరుమలనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఆదివారం నుంచి ఏప్రిల్ 9వరకు 10రోజుల పాటు అంగరంగ వైభవంగా స్వామి వారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు ఆదివారం తెలిపారు.

ఎండిన పంటలను పరిశీలించాలి

ఆత్మకూరు(ఎం) : జిల్లాలో ఎండిన వరిపంట పొలాలను ప్రజా ప్రతినిధులు పరిశీలించాలని వ్యవసాయ రైతు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వరి పంటలు ఎండిపోయి రైతులు ఆందోళనకు గురవుతుంటే ప్రజాప్రతినిధులు పరిశీలించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎండిపోయిన వరిపంటకు ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి జల్ది రాములు పురుషోత్తం, దయాకర్‌రెడ్డి, మారుపాక వెంకటేషం, కూరెల్ల మత్స్యగిరి ఉన్నారు.